నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL



నిర్మల్ అర్బన్ : శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల

# తండ్రి హత్య.. తల్లి జైలుపాలు..

● అనాథలైన పిల్లలు.. ● ఆదుకోవాలని వేడుకోలు

భీంపూర్, సెప్టెంబర్ 17: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన జానకొండ నారాయణ(38) హత్యకు గురయ్యాడు. ఈ నెల 5న భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు కూడా నమోదైంది. మహారాష్ట్ర పింపల్‌గావ్ అడవిలో ఈనెల 7న గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన మహారాష్ట్ర పోలీసులు ఇది హత్యగా తేల్చారు. పిప్పల్‌కోటికి చెందిన నారాయణ మృతదేహంగా నిర్ధారించుకున్నారు. హత్యచేసిన మార్సెట్టి వినోద్, నారాయణలకు బంధువైన బొనగిరి దేవన్నలను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. నారాయణ భార్య వివాహేతర సంబంధంతోనే ఈ ఉదంతం జరిగిందని తెలుసుకున్నారు. తరువాత మంగళవారం నారాయణ భార్య విజయలక్ష్మీని మహారాష్ట్ర నాందేడ్‌లో రిమాండు చేశారు. దీనితో తేజస్విని(9వ తరగతి), బాబు భజరంగ్(4వ తరగతి)ల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. నారాయణ సోదరుడు సంతోష్, అమ్మమ్మను(మహారాష్ట్ర మాండ)కు పిలిపించి పిల్లల ఆలనాపాలనా చూడాలని పోలీసులు కోరారు.

# గంగమ్మ ఒడికి.. గణనాథులు..

## నిర్మల్‌లో శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎస్పీ

● పోలీసుల భారీ బందోబస్తు.. ప్రార్థన మందిరాల వద్ద మోహరింపు ● తెల్లారే వరకు కొనసాగిన నిమజ్జనం
● డ్రోన్, సీసీ, కంట్రోల్ రూం ద్వారా నిఘా పర్యవేక్షణ ● దగ్గరుండి పర్యవేక్షించిన ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 17 : నిర్మల్ జిల్లా కేంద్రంలో తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న వినాయకుడి నిమజ్జన శోభాయాత్రను మంగళవారం బీజేపీ శాసన సభా పక్షనేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు పట్టణంలోని బుధవార్‌పేట్ కాలనీలో నెలకొల్పిన వినాయకులకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిలలు మాట్లాడుతూ.. నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా కొనసాగించాలని ఉత్సవ సమితి సభ్యులు, మండపాల నిర్వాహకులకు పోలీసులు సూచించారు. నిర్మల్ పట్టణంలో దాదాపు 250కిపైగా గణపతులను ప్రతిష్టించారని, వీటిని 5,7,9, రోజుల్లో నిమజ్జనం చేశారని, ముఖ్యమైన గణపతులు నంబర్ ప్రకారం ఉన్న దాదాపు 50 గణపతులను మంగళవారం నిమజ్జనం చేశారని తెలిపారు.



ఆదిలాబాద్‌లో గణేశ్ నిమజ్జనానికి శోభాయాత్రగా వెళ్తున్న భక్తులు

### పోలీసుల భారీ బందోబస్తు..

వినాయక నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలు, శాంతియుతంగా నిర్వహించేందుకు ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 700 మంది పోలీసులు ఈ శోభాయాత్ర విధుల్లో పాల్గొన్నారు. ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఆర్మ్‌డ్ ఫోర్స్, సివిల్ ఫోర్స్, భద్రతా దళాలు అడుగడుగునా నిఘాను పటిష్టం చేశారు. శోభాయాత్ర మార్గంలో 42 సీసీ కెమెరాలు, 10 సోలార్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రార్థన స్థలాలు, చర్చీలు, మందిరాల వద్ద పోలీసులు పహారాకాచారు. కలెక్టర్ అభిలాష అభినవ్ వినాయక్‌సాగర్‌ను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈమె వెంట అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా వైద్యాధికారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్ రాజు ఉన్నారు.

### సత్ఫలితాలిచ్చిన సెక్టార్ విధానం

వినాయక నిమజ్జనానికి ఎస్పీ జానకి షర్మిల సెక్టార్ విధానాన్ని అమలు పర్చి నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించారు. బుధవార్‌పేట్ కాలనీ నుంచి బంగల్‌పేట్(వినాయక్ సాగర్) వరకు తొమ్మిది సెక్టార్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో సెక్టార్ వినాయకుని కొద్ది మంది ఫోర్స్‌ను ఏర్పాటు చేసి వారివారి రూట్‌లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు.

### ప్రశాంతంగా నిమజ్జనం

ఎదులాపురం, సెప్టెంబర్ 17 : ఆదిలాబాద్ జిల్లాలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం శోభాయాత్రగా గణనాథులు బయలు దేరి ప్రధాన కూడళ్ల గుండా సాగాయి. వివిధ ఆకృతులలో ఉన్న గణేశులను డప్పువాద్యాలు, బ్యాండ్ల చప్పుళ్లు, భజన కీర్తనల మధ్య వాహనాల్లో తీసుకువెళ్లారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. శోభాయాత్రతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు చూడటానికి భారీగా జనం తరలివచ్చారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బం ది పగడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశా రు. బుధవారం తెల్లవారు జాము వరకు గణనాథులను సమీప పెన్‌గంగలో నిమజ్జనం చేశారు.



పెన్‌గంగాలో నిమజ్జనం చేస్తున్న ఆదిలాబాద్ గుజరాతి సమాజ్ సభ్యులు



వినాయక్ సాగర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## శోభాయాత్రలో మాజీ మంత్రి

ఎదులాపురం, సెప్టెంబర్ 17 : వినాయక నిమజ్జన శోభాయాత్రల్లో మంగళవారం మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. రామన్న గణేశ్ మండప యువకులతో కలిసి నృత్యం చేశారు. మొదట దస్నాపూర్, కైలాశ్‌నగర్, న్యూ హౌసింగ్ బోర్డు, రాంనగర్, భుక్తాపూర్‌లలోని పలు మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్థానికులకు ప్రసాద వితరణ చేశారు.



శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న


## హైంధవ ధర్మ గొప్పతనాన్ని చాటాలి

● ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్ ● సార్వజనిక్ ఆధ్వర్యంలో శోభాయత్ర ప్రారంభం

ఎదులాపురం, సెప్టెంబర్ 17 : హిందూ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహించి హైంధవ ధర్మం గొప్పతనాన్ని చాటాలని ఎంపీ నగేశ్ అన్నారు. మంగళవారం వినాయక్‌చౌక్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో గణేశ్ నిమజ్జన సార్వజనిక్ శోభాయత్రను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎస్పీ గౌష్ ఆలంలతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భక్తి కనబర్చేలా నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ప్రతి శుభకార్యక్రమం వినాయకుడి పూజతోనే ప్రారంభం అవుతుందని, పది రోజులపాటు పూజలు అందించి నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పట్టణంలో 600 నుంచి 700ల వరకు వినాయకులను ప్రతిష్టించారని, జిల్లా వ్యాప్తంగా 1200లకు పైగా ప్రతిష్టించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. మనతోపాటు పక్కన వారిని కూడా సంతోషంగా ఉంచడమే సనాతన ధర్మమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, ప్రముఖ వ్యాపారవేత్త భజరంగ్లాల్ అగర్వాల్, ప్రధాన వక్త ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకటశశికుమార్, హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్నూర్ భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గణపతి విగ్రహాన్ని ఎత్తుకుని వస్తున్న ఎంపీ నగేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎస్పీ గౌష్ ఆలం



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కైలాష్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

# రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తాం

## కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సోయిలేదా?

● తెలంగాణ తల్లి విగ్రహం పెట్టకుండా అవమానించారు.. ● మాజీ మంత్రి జోగు రామన్న ● తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ) : సచివాలయం ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలగిస్తామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి ఆయన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి ఉండాల్సిన చోట కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే చర్యగా అభివర్ణించారు. కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2010 డిసెంబరు 10న అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా ప్రకటన చేశారని, సోనియాగాంధీ ఆదేశాల మేరకు డిసెంబరు 23న ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవడంతో వందలాది మంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని, యువత బలిదానాలకు రాజీవ్‌గాంధీ కుటుంబం కారణమన్నారు. ఇలాంటి నాయకుని విగ్రహం సచివాలయం ఎదుట పెట్టడం సిగ్గుమాలిన చర్యలుగా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టకుండా అవమానపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, యూనిస్ అక్బానీ, మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, జహుర్‌రొద్దీన్, పురుషోత్తం, ఆసీఫ్, స్వప్న పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనిల్ జాదవ్

బోథ్, సెప్టెంబర్ 17 : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ తల్లి చిత్రపటానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాలాభిషేకం చేశారు. జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సువిశాలమైన భారతదేశంలో అంతర్భాగంగా మారిందని, రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన పొందిందని, అందుకే గత ప్రభుత్వం జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా పక్షం రోజులపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ డి.నారాయణ రెడ్డి, సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సదానందం, రమణగౌడ్, తాహెర్ బిన్ సలాం, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

## అభివృద్ధి పథంలో తెలంగాణ

● సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం ● ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ఆదిలాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ) : స్వతంత్ర్య భారతావనిలో 60 సంవత్సరాల స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి, స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవరణలో ఆయన జాతీయ జెండాను ఎగుర వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం విద్యుత్, నీటి పారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనతోపాటు అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి, తెలంగాణను సంక్షేమ రాజ్యంగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2న జిల్లాలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన రాజయ్య


నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 17 : నిర్మల్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ జిల్లా ప్రజలకు తెలంగాణ ప్రజా పాలన దినోత్స శుభాకాంక్షలు తెలిపారు. నాటి రాచరిక పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటాలను గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కలెక్టర్ అభిలాష్ అభివన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్ కుమార్‌లు చైర్మన్ రాజయ్య అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాజయ్య

## అడుగడుగునా బందోబస్తు

ఎదులాపురం, సెప్టెంబర్ 17 : జిల్లా వ్యాప్తంగా గణపతి నవ రాత్రోత్సవాలను పురస్కరించుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ పాల్గొని సిబ్బంది చేయాల్సిన విధులపై సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం మొదలు బుధవారం మధ్యాహ్నం వరకు గణపతి నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వెయ్యి మంది పోలీసు సిబ్బందికి అదనంగా 200 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీతో ప్రత్యేక నిఘా, 250 మంది ట్రెయినీ కానిస్టేబుల్స్‌తో అదనపు బందోబస్తు.. అంబేద్కర్ చౌక్, వినాయక్ చౌక్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

## విధుల బహిష్కరణ

● బోథ్ సీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలి
● పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి

బోథ్, సెప్టెంబర్ 17 : బోథ్ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో మంగళవారం వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. అత్యవసర సేవలు మినహా ఓపీ సేవలను నిలిపివేశారు. సిబ్బందిపై తరచు దాడులు జరుగుతున్నందున పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సీహెచ్‌సీలో అవసరమైన వైద్య సిబ్బందితోపాటు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నాలుగైదు సార్లు విధుల్లో ఉన్న సిబ్బందిపై రోగుల వెంట వచ్చి వారు దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము విధులు బహిష్కరిస్తున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుభాష్ చందర్ చేరుకుని వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. విషయాన్ని కలెక్టర్‌తోపాటు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి సమాచారం అందించారు. ఆస్పత్రిలో సౌకర్యాలతోపాటు సిబ్బంది నియామకం, పోలీస్ అవుట్ పోస్టు నియామకమై కలెక్టర్‌ను విన్నవించేందుకు సూపరింటెండెంట్‌తోపాటు వైద్యులు తరలివెళ్లారు.



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైద్య సిబ్బంది